క్లుప్తంగా

5 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

నాగులుప్పలపాడు: జె.వై.ఎస్ అండ్ రాజేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో ఈ నెల 5వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.25,116, రెండో బహుమతిగా రూ.20,116, మూడో బహుమతిగా రూ.15,116, నాలుగో బహుమతిగా రూ.10,116 అందించనున్నట్లు వివరించారు. ఎంట్రీల కోసం 88869 33272, 79933 49150 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

9 మంది జూదరుల అరెస్టు

చీమకుర్తి: చీమకుర్తి గరికమిట్ట పరిసరాలలో పేకాట, అచ్చుబొమ్మ ఆడుతున్న 9 మందిని ఎస్సై జీ రామిరెడ్డి తన సిబ్బందితో కలిసి ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,740 స్వాధీనం చేసుకున్నారు.

ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షునిగా వెన్నపూస

ఒంగోలు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ నూతన అధ్యక్షునిగా వెన్నపూస శ్రీరాములురెడ్డి నియమితులైనట్లు ప్రస్తుత అధ్యక్షుడు నైనాల రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శిగా నోబుల్ చెరియన్, కోశాధికారిగా అడపాల వెంకటేశ్వర్లు ఎంపిక య్యారని చెప్పారు. 2023–24 సంవత్సరానికి వీరు బాధ్యతలు చేపడతారని, ప్రస్తుత కార్యవర్గం జూన్ వరకు ఉంటుందని వెల్లడించారు. జూన్‌లో నూతనంగా ఎంపికైన వారు బాధ్యతలు చేపడతారని తెలిపారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక సప్తాహ్నిక బ్రహ్మోత్సవ కల్యాణానికి నేటి నుంచి అంకురార్పణ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి రోజూ స్వామివారికి అనేక అవతారాలలో సేవలు నిర్వహించిన అనంతరం ఈ నెల 7వ తేదీ కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంజిరెడ్డి

నాగులుప్పలపాడు: వేసవి నేపథ్యంలో మండలంలోని పోతవరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ గ్రామ సచివాలయ కన్వీనర్ డాకా అంజిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎంపీపీ దంపతులు అంజమ్మ, కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ రేణుకా సురేష్ సహకారంతో గ్రామస్తులతో పాటు వాహనదారుల కోసం ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మోదీని గద్దె దింపే వరకు ఉద్యమిద్దాం

చీమకుర్తి: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న ప్రధాని మోదీని గద్దె దించే వరకు ఉద్యమిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి సంతనూతలపాడు బస్టాండ్ వద్ద సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి



పూజలు చేస్తున్న శిద్దా సుధీర్‌కుమార్

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆలయ వేదపండితులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. లలితా సహస్రనామార్చన, హనుమాన్ చాలీసా కార్యక్రమాలను వాసవీ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తనయుడు శిద్దా సుధీర్‌కుమార్, వారి కుటుంబ సభ్యులు అమ్మవారితో పాటు ఆలయంలోని సకల దేవతలకు పూజలు చేసి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఒంగోలులో...

ఒంగోలు టౌన్: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని ఒంగోలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సామూహిక కుంకుమార్చన చేశారు. అమ్మవారికి జేజేలు పలుకుతూ సింహ వాహనంపై ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నకూటోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

- మళ్లీ ముఖ్యమంత్రిని చేయండి
- 39వ డివిజన్ గడప గడపలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



మహిళకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: మహిళలందరూ చల్లని దీవెనలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రిని చేయాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీజేఆర్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వచ్చే ఎన్నికలలో మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని విజ్ఞప్తి చేశారు. పీర్లమాన్యం, అరుణోదయకాలనీ, సమతానగర్‌లోని 800 గృహాలను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందించి ఎవరెవరికి ఏయే పథకాలు అందాయో వివరించారు. ప్రతి ఇంటికి నగదు రూపంలో ఎంతెంత లబ్ధి చేకూరిందో తెలిపారు. తొలుత 39వ డివిజన్ కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, తిరుపతిరావు ఆధ్వర్యంలో బాణసంచా కాలుస్తూ ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఆలయాలలో పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు నూకతోటి మస్తానమ్మ, కృష్ణలత, సుజాత, పద్మావతి, వర్దు శేషయ్య, చంద్రశేఖర్, కత్తినేని శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జూన్ నాటికి రెడ్డి హాస్టల్ అభివృద్ధి



రెడ్డి హాస్టల్‌పై సమీక్షిస్తున్న అయోధ్య రామిరెడ్డి, తదితరులు

ఒంగోలు: వచ్చే జూన్ నాటికి స్థానిక మామిడిపాలెం చెరువు వద్ద ఉన్న రెడ్డి హాస్టల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు రాజ్యసభ ఎంపీ అయోధ్య రామిరెడ్డి తెలిపారు. శనివారం ఒంగోలు వచ్చిన ఆయన.. స్థానిక రెడ్డి హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. కరోనా సమయంలో హాస్టల్ మరమ్మతులకు గురైందని, గతంలో 200 మంది విద్యార్థులకు ఆశ్రయం కల్పించేదని తెలుసుకున్నారు. అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. దక్షిణ బైపాస్‌లోని స్వర్గీయ కాసు బ్రహ్మానంద రెడ్డి విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించి బ్రహ్మానంద రెడ్డికి నివాళులర్పించారు. ఆయన వెంట మార్కెటింగ్, సహకార విభాగం ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, రెడ్డి హాస్టల్ మాజీ అధ్యక్షుడు రాంగోపాల్‌రెడ్డి, మాలే రామసుబ్బారెడ్డి, చెంచిరెడ్డి, పల్లెల వెంకట్రామిరెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకరరెడ్డి, దామరాజు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల విజయభేరి

ఒంగోలు: తాజాగా విడుదలైన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ఒంగోలులోని పలు కాలేజీల విద్యార్థులు విజయభేరి మోగించారు. తమ విద్యార్థులు బీఎస్సీలో 92 శాతం ఉత్తీర్ణులయ్యారని స్థానిక బీఏఅండ్‌కేఆర్ డిగ్రీ కాలేజీ సెక్రటరీ బూచి అంజమ్మ, కరస్పాండెంట్ బూచి కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బీజెడ్‌సీలో ఎస్‌కే రెహాన 882/900, ఎస్‌కే ఫర్హాన 880/900, ఎంపీసీఎస్‌లో పి.పూజిత 773/800, బయోటెక్నాలజీలో కె.అజయ్‌భార్గవ్‌రెడ్డి 865/900 సాధించారన్నారు. బీజెడ్‌సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. గణితం సబ్జెక్టులో ఏడుగురు విద్యార్థులు 75/75 మార్కులు సాధించారని పేర్కొంటూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

సత్తాచాటిన శ్రీసరస్వతి కాలేజీ విద్యార్థులు...
డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారని శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. బీఎస్సీ (ఎంఎస్‌సీఎస్)లో బచ్చల ప్రియాంక–767/800, అప్పన్నగారి లక్ష్మీప్రియ–762/800, బీఎస్సీ ఎంపీసీఎస్‌లో దావులూరి సుగుణ–736/800, చీరబోయిన సంధ్యారాణి–730/800, బీఎస్సీ ఎంపీసీలో పి.నాగలక్ష్మి–720/800, బీఎస్సీ ఎంబీసీలో యు.శ్యామల–744/800, ఎస్‌కే ప్రత్యూష–744/800, బీబీఏలో మూలే పావని–484/600 మార్కులు సాధించారన్నారు. గణితంలో 25 మంది 75/75, స్టాటిస్టిక్స్‌లో ఐదుగురు 75/75, కెమిస్ట్రీలో ఐదుగురు 75/75 మార్కులు సాధించారని చెప్పారు.

శ్రీహర్షిణి విద్యాసంస్థల ప్రభంజనం...
డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏస్సీ బీజెడ్‌సీలో బీ మెర్సీమాధురి 883/900, బీఎస్సీ ఆక్వాకల్చర్‌లో అద్దంకి విష్ణుప్రియ 855/900, అగ్రికల్చర్‌లో ప్రియాంక నుసుం 854/900, టీయండబ్ల్యూ విభాగంలో ఎస్.శ్రీచందన, ఎం.శ్రావణి 838/900, ఎంఎస్‌సీఎస్‌లో వెలగపూడి సాయిలక్ష్మి చాందిని 787/800, ఎంపీసీఎస్‌లో షేక్ ఆయేషా 771/800, ఎంపీసీ విభాగంలో ముద్రగడ శ్యామల 770/800, ఎంసీసీఎస్ విభాగంలో పి.భూషణ్‌కుమార్ 769/800, ఎంఈసీఎస్ విభాగంలో యర్రబోయిన వెంకట సాయి 729/800, బీబీఏ విభాగంలో లక్కు వెంకట లక్ష్మీప్రసన్న 459/600 మార్కులు సాధించారన్నారు. గణితంలో 81 మంది, స్టాటిస్టిక్స్‌లో 16 మంది, కంప్యూటర్స్‌లో 18, కెమిస్ట్రీ–19, ఫిజిక్స్‌లో ఐదుగురు వందశాతం మార్కులు సాధించారని వివరించారు.

వీవీఆర్ విద్యార్థుల జయకేతనం...
తమ కాలేజీ విద్యార్థులు ఐదో సెమిస్టర్ ఫలితాల్లో జయకేతనం ఎగురవేశారని వీవీఆర్ డిగ్రీ కాలేజీ చైర్మన్ వడ్లమూడి వెంకట్రావు తెలిపారు. 95 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

చీమకుర్తి: మండలంలోని పల్లామల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులందరూ పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. రామతీర్థంలో గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా నెల పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. మారం వెంకారెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

మే నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్

ఒంగోలు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు ఒంగోలు పోలీస్ సబ్ డివిజన్‌లో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ యు.నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్‌రెడ్డి

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి, జీవనోపాధులు మెరుగుపరుచుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త విధానాలు, పథకాలు తీసుకొస్తున్నాయని మత్స్యశాఖ జేడీ అవుల చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌లో భాగంగా కె.పల్లెపాలెం బంగారమ్మ గుడి ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జేడీ పాల్గొని మాట్లాడారు. ముందుగా టీవీ ప్రసారంలో మత్స్యకారులనుద్దేశించి నరేంద్ర మోదీ మాట్లాడారు. అయితే హిందీ అర్థం గాక తికమకపడ్డారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జేడీ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల కోసం ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాల గురించి వివరించారు. సమస్యలడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు మత్స్యకార్మిక యూనియన్ అధ్యక్షుడు గొల్లపోతు నాగార్జున, మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్, గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ కృష్ణ, ఫీల్డ్‌మేన్ గౌరీశంకర్, గ్రామ కాపులు సైకం పోతురాజు, సింగోతు వెంకటేశ్వర్లు, తంబు వెంకటేశ్వర్లు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు, సాగర మిత్రలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు

మద్దిపాడు: మండలంలోని తూర్పు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేని ఆదివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నరసింహారావు ఆధ్వర్యంలో కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల తరహాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రత్యేక యూనిఫాం ధరించి పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చలమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనగా, ప్రభుత్వ పాఠశాలలో సైతం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినందుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ఎంఈవో ఎంవీఆర్ ఆంజనేయులు అభినందించారు.

జీజీహెచ్‌కు వీల్‌చైర్ల బహూకరణ



వీల్‌చైర్లు అందజేస్తున్న జూపూడి యువసేన సభ్యులు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు జన్మదినం సందర్భంగా జూపూడి యువసేన ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వీల్‌చైర్లు బహూకరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ఆర్‌ఎంవో చైతన్య, ఏఆర్‌ఎంవో విజయశ్రీ,, తదితరులు పాల్గొన్నారు.

50 మంది విద్యార్థులకు ఉచిత విద్య

ఒంగోలు: జిల్లాలో పదో తరగతి పూర్తిచేసిన నిరుపేద, తల్లిదండ్రులు లేని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 50 మంది విద్యార్థులను తమ సంస్థ ఆధ్వర్యంలో దత్తత తీసుకుంటున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక కర్నూలు రోడ్డులోని శ్రీదివ్య అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. దత్తత తీసుకుంటున్న విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ విద్యను ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తిగలవారు స్థానిక మాంటిస్సోరి స్కూలులోగానీ, కర్నూల్‌రోడ్డులోని శ్రీదివ్య అకాడమీలోగానీ మే 31వ తేదీలోగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు టౌన్: నగరంలో ఎలక్ట్రానిక్ కాంప్లెక్స్ ఏర్పాటు గురించి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో మాట్లాడతానని ఎలక్ట్రానిక్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు చేరెడ్డి లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లయ్య లింగం భవనంలో నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలినేని సహకారంతో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ అండ్ టీవీ మెకానిక్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామర్తి సత్యనారాయణ, పొన్నుం హరిబాబు, ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ

దొనకొండ: స్థానిక వైన్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.1.90 లక్షలు స్వాహా చేశారు. ఎస్‌ఐ యం.సైదుబాబు తెలిపిన వివరాలు.. వైన్‌షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపారతో తాళాలు పగులగొట్టి రూ.1.90 లక్షలు దొంగలించారు. ఒంగోలు క్లూస్ టీమ్ ఎస్‌ఐ శరత్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది వేలి ముద్రలు సేకరించారు. త్రిపురాంతకం సీఐ పాపారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.